## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-09-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే కామం, క్రోధం, లోభం ఈ మూడు నరకానికి వెళ్ళడానికి పెద్ద గేట్లు అని చెప్పాడు. ఇవి మూడు మనలో ఉన్నాయి అనుకోండి, మనకి నరకం వచ్చేస్తుంది అని భగవంతుడు చెప్పాడు. ఇంకో సాక్ష్యం ఎందుకు? ఇంక మనం ప్లీడరు సలహాకి వెళ్ళనక్కరలేదు. ఇది కామన్‌సెన్స్ విషయం. మీకు కామం, క్రోధం, లోభం ఉంటే అవి నరకానికి ద్వారాలు, మనని నరకానికి తీసుకొనిపోతాయి నేచురల్‌గా అని భగవంతుడు చెపుతున్నాడు. అయితే అవి మనకి ఉన్నాయా, లేవా? అవి వస్తున్నాయి, పోతున్నాయి. ఒకోసారి ఉండమన్నా ఉండటం లేదు. ఎప్పడు జ్ఞాపకం వస్తే అప్పడు వస్తున్నాయి, మరల పోతున్నాయి. కోపం మనకి చెప్పిరాదు. మళ్ళీ దానంతట అదే పోతుంది. అసలు ఈ కామం, క్రోధం ఇవన్నీ లగ్జరీస్, భోగాలు. క్రోధం అనేది ఇట్ ఈజ్ నాట్ అవర్ నేచురల్ స్టేట్. ఇట్ ఈజ్ నాట్ అవర్ నార్మల్ స్టేట్. కోపం ఎవరికి వస్తుంది? అన్ని రకాలుగా బాగున్న వాడికే కోపం ఎక్కువగా వస్తుంది. ఒకపూట తిండి ఉండి, ఒకపూట తిండి లేని వాడికి కోపం రావటం మీరు చూసారా? బికాజ్ ఇట్ ఈజ్ ఏ లగ్జరీ. మీరు సినిమాకి వెళ్ళటం ఎటువంటిదో, మీకు కోపం రావటం కూడా అటువంటిదే. తిండికోసం బాధపడేవాడు సినిమా గురించి ఆలోచించడు. మీకు ఇంటివద్ద అన్ని విధాలా సదుపాయంగా ఉన్నప్పడే మీకు కోపం వస్తుంది. ధనవంతులకే కోపం ఎక్కువ వస్తూ ఉంటుంది. పేదవాడికి కోపం వచ్చినా పాపం వాడు అలా అణుచుకొని అణుచుకొని ఉంటాడు. సాగుతుందా వాడికి - సాగదు. ధనవంతుడికి కోపం వస్తుంటే అది వాడికి భోగం అన్నమాట. కానీ వాడు ఆత్మకి దూరం అయిపోతున్నాడు.

ఇప్పడు మనిషికి కామం వస్తోంది అనుకోండి, ఆ కామం మనం అనుకోండి, ఎలా పోతుంది? మీకు ఎప్పడైనా కోపం వస్తోంది. ఆ కోపం మీరనుకోండి ఎప్పడూ ఉండిపోవాలి కదా? మరి వచ్చి ఎందుకు వెళ్ళిపోతోంది? మీకు కోపం వస్తోంది వెళ్ళిపోతోంది. అది నిజంగా మీరే అయితే వెళ్ళదు. మీరు కాని దాన్ని తీసుకొచ్చి ఇక్కడ కూర్చోపెట్టుకొని దాన్ని మళ్ళీ జయించటం అనే సమస్య పెట్టుకొంటున్నారు. మీరు జయించడానికి అది మీరైతే కదా అసలు! మీకు ఇంటివద్ద ఎప్పడో ఒకప్పడు కోపం వస్తోంది. ఆ కోపం మీరే అయితే అది 24 గంటలు, 365 రోజులు, మీరు మరణించే

వరకు, మిమ్మల్ని స్మశానానికి తీసుకెళ్ళేవరకూ ఆ కోపం అలా ఉండిపోవాలి. ఎంత కోపదారికైనా అలా ఉండటం లేదు కదా! ఏదో ఒక గంటలో బరస్ట్ అవుతాడు, ఇంకో గంటలో నార్మల్ స్టేట్‌కి వచ్చేస్తాడు. బికాజ్ ఇట్ ఈజ్ నాట్ అవర్ రియల్ స్టేట్. అలాగే కామం కూడా నిజం కాదు. కామమే కనుక నేచురల్ స్టేట్ అయితే, అది నిజం అయితే పెర్మనెంట్‌గా ఎప్పుడూ ఉండిపోవాలి. అది కూడా మన మైండ్‌లో ఒక వికారంలా పుడుతుంది. అది పోతుంది. అవి నిజాలు కాదు. మైండ్‌లో మీకు వచ్చే డిస్ట్రబెన్సులు. అవి నిజం అయితే ఎప్పుడూ పెర్మనెంట్‌గా ఉండిపోవాలి. మీరు నిజంగా కామం అనుకోండి, లేకపోతే లోభం అనుకోండి, కోపం అనుకోండి, మరి మీరు ఆత్మ అని భగవంతుడు ఎందుకు చెపుతున్నాడు? మీరు ఆత్మ అని చెపుతున్నాడు కానీ మీరు కామం అని చెప్పటం లేదు కదా! మీరు నిజంగా కామమే అనుకోండి, కామమనే చెప్పేవాడు ఇది మీరు ఇక్కడ అర్థం చేసుకోవలసిన సబ్జెక్టు. అది మీరు కాదు కాబట్టి కాదు అని చెపుతున్నాడు.

మీరందరూ సహజంగా భక్తిపరులే, జ్ఞానులే, కానీ మేము భక్తులం కాదు, జ్ఞానులం కాదు అని మీరు అనుకొంటారు అనుకోండి, అది కూడా అబద్ధమే. మీరు అనుకొంటే ఎలా కుదురుతుంది! మీరు అనుకోకపోయినా మీరు జ్ఞానులే. అయితే ఎందుచేత అది మీకు అనుభవంలోకి రావటంలేదు? మీకు కామం, కోపం, చిరాకు, ద్వేషం, ఇవన్నీ అప్పుడప్పుడూ వస్తున్నాయి కదా? అవి మీకు సహజంగా ఉన్న భక్తిని చెడగొట్టేస్తున్నాయి, ప్రశాంతంగా ఉన్న చెఱువులో బెడ్డ వేస్తే కెరటాలు వస్తాయి. లేకపోతే కింద ఉన్న బురద పైకి వచ్చేస్తుంది. అయితే ఆ కెరటాలు రావటం ఆ చెఱువుకు సహజ స్వభావం కాదు. గాలి వచ్చినప్పుడు కెరటం వస్తుంది. బెడ్డవేస్తే కెరటం వస్తుంది. లేకపోతే చెఱువు ప్రశాంతంగా ఉంటుంది. మీ స్వరూపం జ్ఞానమే, భక్తే. మనకి ఈ డిజైర్స్, డిస్ట్రబెన్సులు, రావటం వల్ల మనం భక్తికి దూరంగా ఉన్నామేమో, జ్ఞానానికి దూరంగా ఉన్నామేమో అనిపిస్తుంది.

మీకువచ్చే కామం కానీ, కోపం కానీ, ద్వేషం కానీ, అసూయ కానీ, కొండేలు చెప్పే స్వభావం కానీ, అవన్నీ కూడా మీ మనస్సులో పుట్టే వికారాలు, అవి మీరు కాదు. మీరు భక్తులే. ఇది మీరు అర్థం చేసుకోవాలి. ఒకవేళ మీకు కొండేలు చెప్పే స్వభావం ఉండొచ్చు, ఉన్నా అది మీరు కాదు. అది మీరు విడదీసుకోండి, మీరు సబ్జెక్టు విడదీసుకోవటం మానేసి మేం సాధన చేస్తున్నాం, ప్రాణాయామం చేస్తున్నాం అంటే కోటి సంవత్సరాలు చేసినా మీకు పురోగతి లేదు. కృష్ణుడు కామాన్ని జయించు,క్రోధాన్ని జయించు, లోభాన్ని జయించు

లేకపోతే అవి మూడు నరకానికి తీసుకెళ్ళిపోతాయి అని గీతలో రిపీటెడ్‌గా చెప్పాడు. ఒకోసారి మర్చిపోయి ఇన్నిసార్లు చెపుతున్నాడేమో అనిపిస్తుంది. మర్చిపోయికాదు, మనకి ఏదో రకంగా బుర్రకి ఎక్కించటం కోసం అలా చెప్పాడు.

అసలు మనకి ఇవి మూడు ఎందుకు వస్తున్నాయి, ఎలా వస్తున్నాయి, ఎక్కడ వస్తున్నాయి అర్థం అవ్వాలి కదా. ఒకవేళ మీకు కోపం వచ్చినా అది మీరు కాదు, కామం వచ్చినా అది మీరు కాదు, లోభిత్వం వస్తుందనుకోండి, అదీ మీరు కాదు, కొండేలు చెప్పే స్వభావం మీకుంటే, అదీ మీరు కాదు, మీరందరూ భక్తులే, జ్ఞానులే. మనం పుట్టాం, పెరుగుతున్నాం, చనిపోతున్నాం అనుకొంటున్నాము. ఈ మాటలు మనకెందుకు వస్తున్నాయంటే, ఈ శరీరం నేను అనే భావన మనలో ఉండిపోయింది. శరీరం నేను అనే భావన స్థిరంగా ఉండిపోవటం వల్ల నేను పుట్టాను అంటాము. ఎవరు పుట్టారు? ఈ శరీరం పుట్టింది. నేను ముసలివాడిని అయిపోయాను అంటారు. ఆత్మ ముసలిది అవుతుందా? శరీరం ముసలిది అవుతుంది. నేను చచ్చిపోతున్నాను, ఇంక ఎంతో కాలం జీవించను అంటాము. ఈ మాటలన్నిటిలోను అజ్ఞానం కనిపిస్తోంది. ఈ మాటలు చెప్పేటప్పుడు కూడా వాడు జ్ఞానే. కానీ శరీరం నేను అనే భావన హృదయంలో ఉంది కాబట్టి వాడికా మాటలు వస్తున్నాయి. శరీరం నేను అనే భావనలోంచి తలంపు పుడుతోంది. తలంపులోంచి మాట వస్తోంది. తలంపు ఈజ్ నాట్ ఏ నేచురల్ స్టేట్. నేను ముసలివాడినయ్యాను, నేను మరణిస్తున్నాను, నేను బీదవాడిని అయ్యాను, నేను ధనవంతుడిని అయ్యాను, నేను నల్లగా ఉన్నాను, నేను ఎఱ్ఱగా ఉన్నాను, నేను పొట్టిగా ఉన్నాను, పొడుగ్గా ఉన్నాను, ఇవన్నీ భేదభావనలు. దేహం నేను అనే భావనలోంచే ఈ వికారాలన్నీ పుట్టుకు వస్తున్నాయి. ఆ మనిషికి అహంకారం ఎక్కువండీ అని అంటాము అప్పడు కూడా వాడు అహంకారం కాదు, వాడు జ్ఞానే.

మేము సాధన చేస్తున్నాము, కానీ ఫలితం కనిపించటం లేదు అని కొంతమంది అంటారు. మీ శరీరానికి యాభైగాని, అరవై గానీ ఏళ్ళ వయస్సు ఉంటుంది. మీరు యాభై ఏళ్ళ నుంచి సాధన చేస్తున్నారు. మరి మాయకి ఎంత వయస్సు? మీ శరీరం ముసలిది అవుతుంది, కానీ మీ లోపల ఉన్న అజ్ఞానం ముసలిది అవుతుందా, మాయ ముసలిది అవుతుందా? భగవంతుడు అజ్ఞానాన్ని పోగొట్టుకోండి అని చెపుతున్నాడు. అదే ఋషులు అందరూ చెప్పారు. మీరెవరైనా అజ్ఞానం ఎలా ఉంటుందో చూసారా? లోపల ఉన్న అజ్ఞానమే మనస్సులో వికారాలుగా తలంపుల రూపంలో వస్తోంది. మీకు లోపలి నుంచి లోభిత్వం,

కామం, క్రోధం, చిరాకు, ద్వేషం వస్తున్నాయనుకోండి, ఇవన్నీ లోపల అజ్ఞానం లోంచే వస్తున్నాయి. అవన్నీ తీసేస్తే అజ్ఞానం పత్తా లేకుండా పోతుంది. అజ్ఞానం ఉంది కాబట్టి ఇవన్నీ వస్తున్నాయి. మీకు వచ్చే తలంపుని వదిలేసి, అజ్ఞానం ఎక్కడో ఉందని అజ్ఞానం కోసం వెదుకుతున్నారు. అది బయట ఉంటే కదా మీకు కనిపించటం. అది బయటలేదు. లోపల అజ్ఞానం మీకు తలంపు రూపంలో వస్తుంది. నా అజ్ఞానం నాకు తలంపు రూపంలో వస్తోందని తెలుసుకోవటం మానేసి, మీరు ప్రకృతిలో వెదుకుతున్నారు. అజ్ఞానాన్ని ఎలా జయించాలి, అది ఎక్కడ ఉంది, నరసాపురంలో ఉందా, భీమవరంలో ఉందా, ఒకవేళ అరుణాచలం వెళితే అజ్ఞానం పోతుందేమో, మీరిలా అనుకొంటారు. ఎక్కడికి పోతుంది. అది మీ లోపల తలంపు రూపంలో ఉంది.

కోపం ఎలా వస్తోంది? ఒకసారి మీరు కోపం తెచ్చుకోండి చూద్దాం. కోపం ఎలా వస్తోంది చూపించండి? మీకు ఎలా వస్తోంది? అది ఏది? కోపం నేను కోపాన్ని అని చెపుతోందా? అది ఒక తలంపు. తలంపే కోపం, తలంపే కామం, తలంపే లోభిత్వం. మీకు కొండేలు చెప్పే స్వభావం, అసూయ ఇవన్నీ తలంపులే. ప్రతీదీ కూడా తలంపులు రూపంలో వస్తోంది. అంతకంటే ఏమీ లేదు. మీకు తలంపు లేకుండా కోపం వస్తుందేమో చూపించండి. సడన్‌గా కోపం వచ్చిందనుకోండి, తలంపుని తీసేయండి, అప్పుడు కోపాన్ని చూపించండి. అయితే కోపం వచ్చినప్పుడు కూడా మీరు నేచురల్ స్టేటులో, నార్మల్ స్టేటులోనే ఉన్నారు. భక్తి సంపాదించాలి, భక్తిని పొందాలి ఇటువంటి భావాలు వస్తున్నాయి మీకు. భక్తి సహజస్థితి, గుణాలు అసహజస్థితి, దాన్ని విభక్తి అంటారు. భక్తి కొత్తది కాదు. మన స్వరూపమే భక్తి. అయితే ఇప్పుడు మనం భక్తికి దూరంగా ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి భక్తి సంపాదించుకోవాలి అనిపిస్తోంది. కానీ అలా అనిపించినప్పుడూ మనం భక్తులమే. భక్తులం కాదు, భక్తికి దూరంగా ఉన్నాము అనుకొన్నప్పుడు కూడా మనం భక్తులమే, ఆ స్టేటుని తీసుకెళ్ళి గుణాలు దానికి దూరంగా ఉన్నట్టు అనిపింపచేస్తున్నాయి. గుణాలని వదిలేస్తే సహజమైన స్థితిలో పడిపోతాము. నా చేతిలో బంతి వదిలేస్తే, దాన్ని కింద పడమని చెప్పనక్కరలేదు. భూమి ఆకర్షణ శక్తి దాన్ని సహజంగా క్రిందికి లాగేస్తుంది. క్రింద పడు అని ఆ బంతితో చెప్పనక్కరలేదు. అలాగే ఎప్పుడైతే మీరు గుణాలని వదిలేసారో, సహజంగా ఆత్మ మిమ్మల్ని లోపలికి గుంజేసుకుంటుంది.

మీకెవరికైనా అనుభవాలు ఉన్నాయా, ఆత్మానుభవం అయ్యిందా అని అడుగు

తుంటారు. అదీ అబద్ధమే, ఆత్మానుభవం ఏంటి, నువ్వు ఒక్కడివే కదా? ఇద్దరు ఉంటే ఒకడు అనుభవిస్తాడు. మిఠాయి తింటున్నాననుకోండి, మిఠాయి తినేవాడిని నేను, మిఠాయి అనే వస్తువు ఇక్కడ రెండు అయ్యాయి. అలాగే ఆత్మని అనుభవిస్తున్నాను, ఆత్మ నాకు అనుభవంలోకి వచ్చింది అంటారనుకోండి, అది అబద్ధం. ఆత్మ అనుభవించేది ఎవరు మీ లోపల? ఆత్మ ఒకటిగా ఉందా రెండుగా ఉందా? ఆత్మ ఒకటిగానే ఉంది, ఇక అనుభవించేది ఎవరు? అదీ అబద్ధమే. ఇది మాట్లాడటం తప్పా అంటే, తప్ప కాదు, ఊరికే వ్యవహారం కోసం అలా చెపుతారు. కానీ ఇట్ ఈజ్ నాట్ ఏ కరెక్ట్ స్టేట్. ఆత్మానుభవం అనేసరికి రెండు అయిపోయాయి. అనుభవింపబడేది ఆత్మ, అనుభవించేది అహంకారం, లేకపోతే మనస్సు, రెండు ఉంటాయా అక్కడ? మీరందరూ మాకు శాంతి కావాలండీ అంటున్నారు. ధనం కోసం మీ కాలాన్ని ఖర్చు పెట్టుకొంటున్నారు, ధనం వస్తోంది. శాంతి కావాలని అడిగే వాళ్ళు ఉన్నారు కానీ, శాంతికోసం మీరెవరైనా మీ కాలాన్ని ఏమైనా ఖర్చు పెడుతున్నారా? దేవుడున్నాడని చెప్పేవాడికీ శాంతి కావాలి, దేవుడు లేడని చెప్పేవాడికీ శాంతి కావాలి, దేవుడు ఉన్నాడో లేడో మాకు తెలియదు అని చెప్పేవాడికీ శాంతి కావాలి, దేహానికి అన్నం ఎలా అవసరమో, మనస్సుకి శాంతి అవసరం. శాంతికోసం మీరేం చేస్తున్నారో చెప్పండి. ఏం ఖర్చు పెడ్తున్నారు శాంతికోసం? మీ కాలాన్ని ఖర్చు పెడుతున్నారా, మీ డబ్బుని ఖర్చు పెడుతున్నారా శాంతికోసం? అందరికీ శాంతి కావాలి, దానికోసం ఎవరూ సెకండ్ కూడా వెచ్చించటంలేదు. నిజంగా కనుక మీకు శాంతి లభ్యమైతే దేవుడు ఉన్నాడా లేడా అనే గొడవే మీకు ఉండదు. నాకు ఇప్పుడు నాలుగు పదార్థాలు వేసి పీక దాకా మీరు అన్నం పెట్టారనుకోండి, నాకింక ఆకలి సమస్య ఉండదు. మీరు శాంతి సముద్రంలో మునిగి ఉన్నప్పుడు దేవుడు ఉంటే ఏంటి లేకపోతే ఏంటి మీకు? అసలు దేవుడు ఉన్నాడా లేడా అనే తలంపు కూడా మీకు పుట్టదు. దేవుడిని తెలుసుకోవటానికి మనిషి చేసే ప్రయత్నం కూడా శాంతి కోసమే, అది వాడికి తెలియదు. దేవుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను అంటాడు. వాడితో దేవుడు ఏమన్నా చెప్పాడా నువ్వు నన్ను తెలుసుకో అని? పోనీ ఆయన అడిగితే వీడు ప్రయత్నం చేయొచ్చు. అది కూడా అబద్ధమే. దేవుడిని తెలుసుకొంటే వాడికి శాంతి వస్తుందని వాడికోసమే వాడు ప్రయత్నం చేసుకొంటున్నాడు.

మీకందరికీ ఆత్మని తెలుసుకోవాలని ఆత్మని సాధించాలని ఉంది. మీరు ఆత్మ అయి ఉన్నప్పుడు దేన్ని సాధిస్తారు మీరు. అయితే ఆత్మ విషయం మాకేమీ తెలియటం

లేదండీ, మేము ఆత్మ అయి ఉన్నాంకదా కానీ దాని గురించి మాకేమీ తెలియటం లేదు అంటారు. మీకు నిరంతరం మీ దేహమే జ్ఞాపకం వస్తోంది, తరువాత మీ మనస్సు మీకు జ్ఞాపకం వస్తోంది. మీ దేహం, మీ మనస్సు ఈ రెండింటి కోసమే మీ ప్రయత్నం. ఇవే మీకు జ్ఞాపకం వచ్చేది. మీరు ఆత్మ అయి ఉన్నప్పటికీ అది మీకు తెలియకపోవటానికి కారణం ఇదే. మీ తలంపులోకి వచ్చేది మీ దేహం, మీ మనస్సే. ఎంతటి వాడైనా ఈ రెండూ దాటి బయటికి వెళ్లలేకపోతున్నాడు. తన దేహం చుట్టూ, తన మనస్సు చుట్టూ తిరుగుతున్నాడు. పుణ్యం చేస్తే భవిష్యత్తులో నేను సుఖపడతానని, పుణ్యాలు చేస్తున్నారు, భవిష్యత్తు అనేది కూడా ఒక తలంపు, పుణ్యం లేదు, భవిష్యత్తు లేదు. ఇదంతా ఎవరికోసం చేస్తున్నారు, మీ కోసం మీరే చేసుకొంటున్నారు. అంటే మీరు సుఖపడాలని మీరు చేసుకొంటున్నారు. ఇంక ఈశ్వరుడి స్వరూపం మీకేం తెలుస్తుంది? మీకు లోకం జ్ఞాపకం వస్తోందంటే, మీ దేహం జ్ఞాపకం వస్తోందంటే, మనస్సు జ్ఞాపకం వస్తోందంటే, ఇంక ఆత్మచింతన లేనట్టే గుర్తు. ఆత్మ చింతన ఉన్న వ్యక్తికి, తన దేహం గుర్తు రాదు, అహంకారం గుర్తు రాదు, ఈ లోకం గుర్తు రాదు. మనం రోజూ గంటో అరగంటో పూజ చేసుకొంటున్నాము సరిపోతుంది అనుకొంటున్నాము. ఆచార్యులవారు చెప్పింది ఏమిటంటే, ఉదయం నువ్వు మంచం మీద నుంచి లేచింది మొదలు, రాత్రి మళ్ళీ నువ్వు పడుకునే వరకూ ఆత్మ చింతన చెయ్యమన్నారు. అప్పుడు నువ్వు సిద్ధపురుషుడవు అవుతావు అని చెప్పారు. సర్వసాధారణంగా చాలామంది లోకాన్ని చింతిస్తూ, ఆత్మని చింతిస్తున్నాము అనుకొంటారు. లోకంలో అజ్ఞానం తప్పించి ఏమీ లేదు. మీరు లోకాన్ని చింతిస్తుంటే అజ్ఞానం పెరుగుతుంది. ఎందుచేతనంటే లోకంలో ఉన్నది అజ్ఞానమే. ఆత్మలో జ్ఞానం ఉంది, శాంతి ఉంది, ఆత్మని చింతిస్తే జ్ఞానం కలుగుతుంది, శాంతి కలుగుతుంది.

రేపు నేర్చుకొంటామండీ, రేపటినుంచి చాలా శ్రద్ధ చేస్తామండీ అని కొంతమంది అంటారు. మరి ఈ సెకను మాటేంటి? ఎవడైతే ప్రతీ సెకను కూడా నేర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడు విద్యావంతుడు అవుతాడు, రేపు కాదు. ఇక్కడెవరైనా బాగా చదువుకొన్న వారు ఉన్నారనుకోండి, ఆ చదువులోంచి వాళ్లకి వినయం రావటం లేదనుకోండి, అది చదువు కాదు. చదువు లోంచి వినయం రాకపోతే అది అవిద్య. విద్యలోంచి వినయం వస్తుంది. అవిద్యలోంచి గర్వం వస్తుంది. నువ్వు నేర్చుకొన్నది నిజంగా విద్య అయితే అందులోంచి వినయం పుట్టుకురావాలి. చాలామంది మాకు దుఃఖం వస్తోంది, అశాంతి

వస్తోంది అంటారు. మీకు అశాంతి వస్తోందనుకోండి, మీరు ఏ పరిస్థితిలోనూ పిరికిపడొద్దు. పిరికిపడ్డారా అశాంతి మిమ్మల్ని తరుముకు వస్తుంది. మీరేం పిరికిపడొద్దు. మీరు నిజంగా శాంతే కోరుకొంటున్నారు కానీ అశాంతి గెంటుకొస్తోంది. అశాంతిని రానివ్వండి, ఉండనివ్వండి ఎంతకాలం ఉంటుందో మీరు అందులో కలవకండి. అది మిమ్మల్ని ఏమి చేస్తుందో చూడండి. అది మీరు కాదు కదా, మీరు ఆత్మే.

దేవుడు బొమ్మ ఒకటి ఎదురుగా ఉండాలి, ఏదో మంత్రం చదువుతూ ఉండాలి. మీరు ఏదో అడుగుతూ ఉండాలి. అది దేవుడు ఇస్తూ ఉండాలి. ఇది ద్వైతవాసన. నేను ఏదో అడుగుతాను, ఆ దేవుడు నాకేదో ఇస్తూ ఉంటాడు, లేకపోతే భవిష్యత్తులో ఏదో ఉపకారం చేస్తాడు. ఇదంతా ద్వైతం. భక్తి, జ్ఞానం అటుంచండి, ఈ ద్వైతవాసన ఉన్నవాడు ఎన్నడూ స్వరూపాన్ని పొందలేడు, వాడు ఎంత భక్తుడైనా సరే. పూర్వపుణ్యం ఎంతో ఉంటేనే కానీ మనిషికి అసలు అద్వైతవాసన పుట్టనే పుట్టదు. మీరు ఇంటి దగ్గర రోజూ పూజలు చేస్తున్నారు కదా! పువ్వులు చవకగా దొరుకుతున్నాయి, కొంటున్నారు లేకపోతే ఇంట్లో ఉంటాయి కోసి దేవుడికి పెడుతున్నారు. మీరు అసలు భగవంతుడిని ప్రేమిస్తున్నారా? లేకపోతే దేవుడికి పువ్వులు పెట్టి మీ ఇంటిలో వాళ్ళని ప్రేమించుకొంటున్నారా? దేవుడి దగ్గర పువ్వులు పెట్టడం, మీరు ప్రేమించుకొనేది ఇంట్లో మనుషులనా? మీరు రోజూ పూజలు చేసుకొంటున్నారు, చేసుకోండి, మీకున్న ఆధారాలన్నీ నేను పడగొట్టడం లేదు, మీ ఆధారాలని కూల్చటం లేదు. మీరు దేవుడి దగ్గర పువ్వులైతే పెడుతున్నారు, కానీ మీరు దేవుడిని ప్రేమిస్తున్నారా? మీరు నిజంగా ఈశ్వరుడిని ప్రేమిస్తున్నారు అనుకోండి, అది భక్తి కానీ మీరు నిజంగా ప్రేమించటం లేదు కదా! పువ్వులంటే పెడుతున్నారు కానీ ప్రేమించటం లేదు కదా, మీ మనస్సుని ఎప్పుడైనా ఈశ్వరుడికి ఇచ్చారా? మీ అహంకారాన్ని ఎప్పుడైనా మేత కింద ఈశ్వరుడికి ఇచ్చారా? మీ అహంకారాన్ని ఈశ్వరుడికి ఇవ్వటానికి ఇష్టపడరు. మీ అహంకారం ఏదో కోరుతుంది ఈశ్వరుడిని. ఈశ్వరుడు దానిని శాంక్షన్ చెయ్యాలి. అందుకే మీరు పువ్వులు పెడుతున్నారు.

ఒకవేళ మీ అహంకారాన్ని కానీ అజ్ఞానాన్ని కానీ ఈశ్వరుడు మింగుదామన్నా మీరు మింగనివ్వరు. అంటే ఏంటీ, మీరు చేసే పూజ ద్వారా, పువ్వులు పెట్టడం ద్వారా, మీకున్న భక్తి ద్వారా ఈశ్వరుడు మీకు స్వాధీనం అవ్వాలి. నేను చెప్పేది నిజమా అబద్ధమా, మీ మనస్సుని పరిశీలన చేసి చూసుకోండి. ఈశ్వరుడికి మీరు స్వాధీనం అవ్వటానికి మీరు

ఒప్పుకోరు. ఈశ్వరుడు మీకు స్వాధీనం అవ్వాలి. ఈశ్వరుడు చెప్పినట్టు మీరు వినరు. మీరు చెప్పినట్టు ఆయన వినాలి. మీరు అడిగినదల్లా ఆయన ఇస్తూ ఉండాలి. ఒకవేళ ఆయన మిమ్మల్ని స్వాధీనం చేసుకొందామనుకొంటే, ఆయనకి స్వాధీనం అవ్వటానికి ఇష్టపడరు. మీరు పువ్వులు ఎందుకు పెడుతున్నారు? మీకు లోపల ఏమీ కోరికలు లేవనుకోండి మీరు పువ్వులు పెడతారా? మీకున్న కోరికలు నెరవేర్చమని ఈశ్వరుడికి అప్లై చేసుకొంటున్నారు. అంటే ఈశ్వరుడు మీరు చెప్పిందల్లా చేస్తూ ఉండాలి.

కొంతమంది దేవుళ్ళని మారుస్తూ ఉంటారు. కొంతకాలం రాముడి ఫొటోకి పువ్వులు పెడతారు. అడిగింది రాముడు ఇవ్వకపోతే శివుడికి మార్చేస్తారు. శివుడికి కొంతకాలం పూజ చేస్తారు, శివుడు మంచోడు కాదు, దుర్గ మంచిది అనుకుంటారు. మళ్ళీ కొంతకాలం తరువాత కలియుగానికి దైవం వెంకటేశ్వరస్వామి అని, వెంకటేశ్వర స్వామిని పట్టుకోండి అంటారు. ఇదంతా నీలోంచే వస్తోంది. ఇలా తిరిగే బదులు, ఒక ఐదు నిమిషాలు ఆత్మ గురించి శ్రవణం చేస్తే మీకెక్కువ పుణ్యం వస్తుంది. అది మీకు తెలియకపోవచ్చు. మీరు తిరుపతి 200 రూపాయలు ఖర్చు పెట్టి వెళ్ళేకంటే, ఆత్మ గురించి ఎవరు చెప్పినా సరే, అయిదు నిముషాలు శ్రవణం చెయ్యండి, రూపాయలు ఖర్చు లేకుండా అంతకంటే మీ కెక్కువ పుణ్యం వస్తుంది. కారణం మీరు ఆత్మ కాబట్టి. భగవంతుడు విభూతి యోగంలో, ముందుగా నేను ఆత్మననే చెప్పాడు. తరువాత కుమారస్వామిని నేను, రాముడిని నేను, కృష్ణుడిని నేను ఇలా చాలా గొడవలు చెప్పాడు. ముందు మట్టుకు అవి చెప్పలేదు. ఆత్మనని చెప్పాడు. ఏమీ చదవని కుర్రవాడిని నూటికి నూరు మార్కులు వద్దులే, పోనీ 35 మార్కులు అయినా తెచ్చుకో అంటాము వాడు పాస్ అయితే చాలని అనుకొంటాము. అలాగే భగవంతుడు ఏంచేసాడు అంటే నూటికి నూరు మార్కులు ఆత్మే, అది కరెక్ట్‌స్టేట్. అందుచేత ఆత్మని తెలుసుకోమని ముందుగా చెప్పాడు. విభూతియోగంలో ఫస్ట్ నేను ఆత్మ అని చెప్పాడు. అందరి హృదయాలలో చైతన్యరూపంలో ప్రకాశిస్తున్న ఆత్మని నేను అని స్పష్టంగా చెప్పాడు. మొట్టమొదటి వాక్యం అది చెప్పాడు. తరువాత నేను రాముడ్ని, కృష్ణుడిని, శంకరుడిని అని చెప్పాడు కానీ ముందు ఇవి చెప్పలేదు. ఎందుకంటే అది ఒక్కటే నిజమని ఆయనకి తెలుసు.

సాధనల ద్వారా ఈశ్వరుడిని మనం స్వాధీనం చేసుకోవటానికి చూస్తున్నాము. నిజంగా మీకు భక్తి ఉందనుకోండి, అంతా ఈశ్వరుడికి తెలుసుకదా. ఈశ్వరుడు నన్ను అలా చేస్తున్నాడు, ఇలా చేస్తున్నాడు అంటారు. మీకు ఇటువంటి ప్రశ్న ఎందుకు పుడుతోంది?

నిజమైనశరణాగతి అయితే ఈశ్వరుడు ఇలా ఎందుకు చేస్తున్నాడు అలా ఎందుకు చేస్తున్నాడు అన్న ప్రశ్న మీ హృదయంలో రానేరాదు. మీకు ఆత్మదర్శనం అయ్యింది అనుకోండి, మీకు ఆత్మానుభవం వచ్చింది అనుకోండి, ప్రపంచంలో ఏ వస్తువును చూసినా మీకు వికారం కలుగదు. ఇది కొండగుర్తు కోసం చెపుతున్నాను. మీకు ఆత్మానుభవం కనుక కలిగితే ఏ వస్తువుని చూసినా మీకు వికారం కలుగదు. దేని గురించి విన్నా మీకు వికారం కలగదు, ఈ విశాలమైన ప్రపంచంలో ఏ సంఘటన గురించి విన్నా లేకపోతే మీ కళ్ళతో ఏది చూసినా లోపల మీరు డిస్ట్రబ్ అవ్వరు. ఈ వికారాలన్నీ మానసిక పరిధిలో ఉన్నాయి. ఆత్మలో లేవు. ప్రతీ మనిషి కూడా నేను కర్తని అనుకొంటాడు. అందుచేత వాడికి దుఃఖం వస్తోంది. కర్తృత్వభావన లేకపోతే ఎవరికీ దుఃఖం రాదు. మనం ఎటువంటి పనులు చేస్తే దుఃఖం వస్తుందో సరిగా అటువంటి పనులే చేస్తున్నాము. అప్పుడు దుఃఖం వచ్చిందని బాధపడతాము అయితే ఆ పని చేయుటం వలన దుఃఖం వచ్చిందని మనకి తెలియటంలేదు. ఎందుచేతనంటే దుఃఖం వెంటనే రాదు కదా. విరేచనాలకి మాత్ర వేసుకొంటే, దానికి నాలుగైదు గంటలు టైము ఉంటుంది. అప్పుడు కానీ మోషన్స్ అవ్వవు. అలాగే పని చేసేటప్పుడు వెంటనే దుఃఖం రాదు మనకి, డ్యూ కోర్సులో దాని కాలం వచ్చేటప్పటకి దుఃఖం వస్తుంది. అందుచేత తెలియక మనం ఆ పని చేసేస్తాము. అంటే ఏ పని చేస్తే దుఃఖం వస్తుందో, సరిగ్గా ఆ పనే చేస్తున్నాము. తరువాత దుఃఖం వస్తోందని బాధపడుతున్నాము. ఈశ్వరుడికి మీమీద ఏమైనా ద్వేషం ఉందా మిమ్మల్ని దుఃఖపెట్టడానికి? నిజంగా ద్వేషం ఉంటే ఆయన దేవుడు ఎలా అవుతాడు? మనం చేసే పనులలోంచే దుఃఖం వస్తోంది, అది మనకు తెలియటం లేదు. ఈశ్వరుడు మమ్మల్ని ఇటువంటి కష్టాలలో పెట్టేసాడు అనుకొంటున్నాము. ఈశ్వరుడు ఎందుకు చేస్తాడు. ఈశ్వరుడికి సంబంధం ఏంటి అసలు మనకి దుఃఖం రావాలని ఈశ్వరుడు కోరుకొంటాడా?

మీ భక్తిలో, పూజలో, జపంలో మిమ్మల్ని మీరు ఎప్పుడైనా మర్చిపోయారా? మీరు ప్రశాంతంగా గుండెలమీద చెయ్యి వేసుకొని ఆలోచించండి. మీరు చేసే భక్తిలో కానీ, జపంలో కానీ, ధ్యానంలో కానీ మిమ్మల్ని మీరు ఎప్పుడైనా మర్చిపోయారా? మిమ్మల్ని మీరు మర్చిపోయే స్థితి మీకు ఎప్పుడైనా కలుగుతోందా? నిరంతరం మీకు మీరే జ్ఞాపకం వస్తున్నారు, ఇంక అక్కడ ఈశ్వర స్మరణ ఏముంది? మనం దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాము. దేహాన్ని ఆత్మ అనుకున్నంతకాలం దుఃఖం మనకూడా వస్తుంది. కృష్ణుడు మధ్య మధ్యలో అర్జునా

భగవంతుడిని విశ్వసించు, నన్ను నమ్ము అంటున్నాడు. సరదాగా చెప్తున్నాడా? నమ్మటం ఎందుకు? డాక్టర్‌గారు మందు ఇస్తారు. ఆ మందు ప్రయోజనం ఎటువంటిదో, మనం నమ్మటం కూడా అటువంటిదే. ఆ మందు గమ్యం కాదు, అలాగే నమ్మటం గమ్యం కాదు. మందు రోగం తగ్గటం కోసం ఇస్తున్నారు, మందు మందు కోసం కాదు, భగవంతుడ్ని నమ్మితే, ఆయనని విశ్వసించటం ద్వారా మన స్థితిని మనం పొందవచ్చు. నమ్మటం గమ్యం కాదు, అక్కడ ఆగిపొమ్మనటం లేదు మనని. ఆయనని నమ్మటం ద్వారా, మన అహంకారానికి మనం దూరం అవుతాము. అహంకారానికి దూరమైతే మనకి జ్ఞానం కలుగుతుంది. నమ్మి ఊరుకోమని కాదు ఆయన చెప్పేది. నమ్మటం ద్వారా మన స్వరూపం మనకి తెలుస్తుంది. నమ్మటం అనేది మీన్స్, గమ్యం మటుకు కాదు.

ప్రతీవాడు ఇంటిదగ్గర ఏవో సుఖాలు అనుభవిస్తున్నాడు కదా, ఈ సుఖాలు ఎంత హాయిగా ఉన్నాయి అనుకొంటాడు, కానీ ఈ సుఖాలన్నీ మళ్ళీ దుఃఖాన్ని తీసుకొస్తాయి. ఇది దుఃఖమిశ్రితమైన సుఖం, దుఃఖాన్ని తీసుకురానిది ఒక సుఖం ఉంది, అది శాంతి లోంచి వచ్చే సుఖం. ఏ సుఖమైతే శాంతిలోంచి వస్తోందో, ఆ సుఖం మటుకు దుఃఖాన్ని తీసుకురాదు. శాంతిలోంచి వచ్చే సుఖం కాకుండా, ఇతర సమస్త సుఖాలు కూడా తప్పని సరిగా దుఃఖాన్ని తీసుకొస్తాయి. నేను చెప్పే మాటలన్నీ మీరందరూ నమ్మండి నమ్మండి అని నేను బ్రతిమాలటం లేదు. ఎప్పుడైనా నేను చెప్పిన విషయం మీకు అనుభవానికి వచ్చినప్పడు, నాన్నగారు ఇలా చెప్పారు అని గుర్తు రావటం కోసం చెప్తున్నాను. కానీ నేను ఏమీ మిమ్మల్ని బ్రతిమాలటం లేదు. మనకి ఇల్లు ఉంది. మంచాలు ఉన్నాయి. ఫాన్‌లు ఉన్నాయి అన్నీ ఉన్నాయి. ఈశ్వరుడు వల్లకాడులో ఉన్నాడు. ఆయనకు ఇల్లు లేదు ఏమీ లేదు. మనకంటే ఈశ్వరుడే సుఖంగా ఉన్నాడు. శివుడికి పడుకోవటానికి మంచం ఏమీ లేదు. పైగా నివాసం వల్లకాడు, అయినా మనకంటే ఆయన ఎక్కువ సుఖంగా ఉన్నాడు. ఇది మీరు గ్రహించండి.

వింటే సరిపోయిందా, ఈ మాటలకేంటి లెండి అని బయటికి వెళ్ళిన తరువాత మీకు ఎవరైనా చెప్పవచ్చు. మరి మాటలకేంటి అంటే వారు ఊరుకోవచ్చు కదా. మరి వాళ్ళని ఎవరైనా తిడితే కోపం ఎందుకొస్తుంది? తిట్టు కూడా మాటే కదా. అది కూడా వాళ్ళకి తెలియదు. వింటే సరిపోయిందా అంటే విన్నా అర్థం అవ్వటం లేదు, అసలు వినకపోతే ఎలా తెలుస్తుంది? దీపం ఉండగానే కుర్రవాడు చదువుకోవటం లేదు, దీపాలు ఆరితే

ఇంకేమి చదువుతాడు వాడు! వింటేనే అర్థం అవ్వటం లేదు. వినకపోతే ఇంకేమి అర్థం అవుతుంది. వాళ్ళనోటినుంచి వచ్చే మాటలు కూడా అనాలోచితపు మాటలు. ఆలోచించి చెప్పటం కాదు, అవి మనం భుజాన వేసుకొని తిరగటం. వింటేనే మనకి మొదలు చివర తెలియటం లేదు. వినకపోతే ఏమి తెలుస్తుంది? ఆచరిస్తున్నారా అని అడుగుతారు, మనకి చేతనైంది ఆచరిస్తాము. చేతకాకపోతే ఆచరించలేము. మనం ఎంత అన్నం తినగలమో అంతే అన్నం తినగలం. మీ అబ్బాయి అంటే మీకు బాగా ఇష్టం. బస్తా బియ్యం తింటాడా, మీరు పెట్టగలరా! మనం ఎంతవరకు ఆచరించగలిగితే అంతవరకే ఆచరించగలుగుతాము. మనకి ఎంతవరకు జీర్ణం అవుతుందో అంతవరకే తినగలం. నిరంతరం మీకు మీ శరీరం జ్ఞాపకం వస్తూ ఉంటే, మీ అహంకారం మీకు జ్ఞాపకం వస్తూఉంటే, మీ మనస్సు మీకు జ్ఞాపకం వస్తూఉంటే ఇంక మీకు భక్తి ఎలా కలుగుతుంది. మిమ్మలను మీరే స్మరించుకొంటున్నారు, ఈశ్వరుడిని కాదు. గాఢనిద్రలో ఈ దేహాన్ని మర్చిపోయి ఉంటున్నాము. మిగతా టైముఅంతా కూడా మనకి దేహమే గుర్తు వస్తోంది కదా. కొంతమంది మాకు భయం వేస్తోంది అంటారు. ఇంటిదగ్గర విషయాలకి కానీ బయటి విషయాలకి గాని భయం వేస్తోంది అంటారు. ఎంతమంది ఉన్నారు భయం వెయ్యటానికి! ఉన్నది ఒక్కటే, అది ఆత్మ అని భగవంతుడు చెపుతున్నాడు. ఇంక ఎవరికి భయపడతారు! అక్కడ నలుగురు కూర్చుంటే ఒకళ్ళనొకళ్ళు చూసి భయపడొచ్చు. రెండు ఉంటే భయం వచ్చే స్తుంది. ఉన్నది ఒకటి, అదే ఆత్మ అని చెప్తున్నాడు ఇంక భయం ఏమిటి చెప్పండి?

మనం లోకం గొడవలు చింతిస్తున్నాము, దేవుడు, వైకుంఠం, కైలాసం గురించి చింతిస్తున్నాము. ఈ చింతించేవాడు ఎవడు లోపల? చింతించేది మన అహంకారమా లేకపోతే మన ఆత్మా? మనలో అహంకారమే చింతిస్తోంది ఆత్మని చింతిస్తే అది నాశనం అవుతుంది. అందుచేత ఈ అహంకారం ఏమి చేస్తుందంటే, ఆత్మ జోలికి వెళ్ళకుండా లోకాన్ని చింతించు, రాముడిని చింతించు, కృష్ణుడిని గురించి చింతించు, వైకుంఠం ఎలా ఉంటుందో, కైలాసం ఎలా ఉంటుందో చూడు, ఈ విషయసేకరణ అంతా అహంకారం చేస్తోంది. మీకు అహంకారం కనుక లేకపోతే లోపల చింతించేవాడు ఎవడున్నాడు? అసలు విషయాలు చూసేవాడు ఎవడున్నాడు? ఏదైనా విషయం కనిపిస్తే కదా మీరు చింతించేది? అహంకారం లేనివాడికి విషయమే కనిపించదు. అహంకారం ఉన్నవాడికి వేరుభావన ఉంటుంది. అహంకారం లేనివాడికి వేరుభావన లేదు. ఇంక చింతించటానికి

ఏముంది! నాకు మీరందరూ ఆత్మగా కనిపిస్తున్నారనుకోండి, ఇంక నేను చింతించటానికి ఏముంది నాకు. ఎల్లమ్మ, పుల్లమ్మ ఎవరిమటుకు వాళ్ళు వేరువేరుగా కనిపిస్తూ ఉంటే మీ అందరి గురించి నేను చింతించాలి. నాలో ఉన్న వస్తువే మీ అందరిలో కనిపిస్తూ ఉంటే ఇంక చింతించటానికి, ఆలోచించటానికి ఏముంది ఇక్కడ! అంటే వైకుంఠానికి వెళ్ళిపోయి మళ్ళీ అలంకరించుకొని, టానిక్కులు అవీ పుచ్చుకొని వస్తుందా అహంకారం! కొంతమంది అత్తవారి ఇంట్లో పని కష్టంగా ఉంటే, పుట్టింటికి వెళ్ళిపోయి 20 రోజులో నెల్లాళ్ళో ఉండి టానిక్కులు అవీ పుచ్చుకొని మళ్ళీ వస్తూ ఉంటారు. అహంకారం టైర్ అయిపోయింది. ఇది వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళిపోయి శుభ్రంగా అక్కడ టానిక్కులు అవీ పుచ్చుకొని, ఈశ్వరుడి చేతో విష్ణువు చేతో శుభ్రంగా వైద్యం చేయించుకొని, అహంకారం మళ్ళీ అలంకరించుకొని భూమి మీదకి వస్తుందా?

మనం చేసే పూజలు జపాలవల్ల మన అహంకారాన్ని అలంకరించుకొంటున్నాము. అది మీకు తెలియటం లేదు. నేను నాలుగు గంటలు పూజ చేస్తున్నానండీ రెండు గంటలు ధ్యానం చేస్తున్నానండీ, కాశీ పదిసార్లు వెళ్ళొచ్చానండీ అంటారు. కాశీ పదిసార్లు అహంకారం కోసం వెళ్ళారా, ఎందుకు వెళ్ళి వచ్చినట్టు? ఇదో పాట. పదిసార్లు కాశీ వెళ్ళొచ్చారా, రోజూ నాలుగు గంటలు పూజ చేస్తున్నారా, ఆరు గంటలు ధ్యానం చేస్తున్నారా, ఈ లెక్క అంతా ఎవరికి. అహంకారం లెక్కేస్తోందా? అహంకారం స్మరిస్తోందా, ఈ గొడవలన్నీ ఆత్మ స్మరిస్తోందా? ఆత్మకి లెక్క కావాలా! మేం పొద్దున ఎనిమిదింటికి కూర్చున్నామండీ రెండింటి దాకా పూజలోంచి లేవలేదు అంటారు. ఇవన్నీ చెప్పేది అహంకారమా, ఆత్మా? అంటే మీ అహంకారాన్ని మీరు అలంకరించుకొంటే, మేము కూడా విని సంతోషించాలి. మా పొగడ్త కూడా మీకు కావాలి అన్నమాట. అబ్బో ఆరుగంటల సేపు కూర్చున్నారా అండీ మీరు! అంటే మా మాట మీ అహంకారానికి మేత. మిమ్మల్ని పొగిడితే రెండు అరటిపళ్ళు మాకిస్తారు. ఇటువంటి మాటలు చెప్తే మీరు నాకేమిస్తారు?

కొంతమంది గౌరవం సంపాదించాలి అంటారు. గౌరవం ఎవరికి, అహంకారానికా ఆత్మకా? మీరందరూ నన్ను గౌరవిస్తారు. ఈ గౌరవం నా అహంకారానికా, లేకపోతే ఆత్మకా? ఆత్మకి గౌరవం కావాలా? ఆత్మకి గౌరవం కావాలంటే దానికంటే వేరుగా ఇంకొక వస్తువు కనిపిస్తోందా దానికి? ఇద్దరు ఉంటే గౌరవం కావాలి. ఉన్నది ఒక్కటే వస్తువు అయితే ఇక గౌరవం ఏంటి అసలు. ఆత్మను తెలుసుకోవటం మానేసి కొంతమంది వాళ్ళ

జీవితాలన్నీ గౌరవం కోసం పాడుచేసుకొంటారు. చివరకు గౌరవం అబద్ధం అన్న సంగతి వాళ్ళు చచ్చిన తరువాత తెలుస్తుంది. వల్లకాడులోకి వెళ్లిన తరువాత వీళ్ళని స్మరించే వాడు ఒక్కడు ఉండడు. ఆ పన్నెండో రోజుతో ఆఖరు! ఈ శరీరసంబంధాలు కుండ సంబంధాలతో పోతాయి. వాళ్ళకి చాలా గొప్ప గౌరవం ఉందండీ అంటారు. ఇదే మాయ. ఆ గౌరవం ఏం చేసుకొంటారు. కూర వండుకొంటారా? అంతకంటే కరివేపాకు మెరుగు తాలింపులో వేసుకోవచ్చు.

ఆత్మకంటే ఎక్కువగా కనిపిస్తోందా మీరు సంపాదించే గౌరవం. ఇది పెద్ద మాయ అని మిల్టన్, పారడైజ్ లాస్ట్‌లో చెప్పాడు. చాలామంది మహాత్ములు మేము చాలా గొప్పవాళ్ళము అనుకొనే వాళ్లుకూడా కామ, క్రోధ, లోభములు జయించినవాళ్ళు కూడా, చివరికి ఈ గౌరవం అనే గోతిలో పడిపోయి జీవితాలని పాడుచేసుకొన్నారు అని చెప్పాడు. మాకు చాలా గొప్ప గౌరవం ఉందండీ చుట్టుపక్కల ఇరవై ఊళ్ళలో అంటారు. ఈ గౌరవాన్ని ఏంచేసుకుంటారు. కామ క్రోధాలను జయించుకొచ్చి చివరికి పాపం గౌరవం అనే గోతిలో పడతారు. ఆ గోతిలోంచి లేస్తేకదా, లేవడిక! ఈ గోతులన్నిటిల్లోంచి లేచి బయటికొచ్చి ఆఖరికి గౌరవం అనే పెద్ద గొయ్యిలో పడ్డాడు. కొంతమంది కామానికి దాసులైతే, కొందరు కోపానికి దాసులైతే, కొందరు కీర్తికి దాసులు. ఏదైతేనేం పళ్ళు ఊడగొట్టుకోవడానికి! మీకు భగవద్గీతలో ఆత్మని తెలుసుకోమని చెప్పాడా లేకపోతే వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళి కూర్చోమని చెప్పాడా? ఇప్పుడన్నీ మోడరన్ డేస్ అని కొంతమంది అంటారు. ఎప్పటికప్పుడే మోడరన్ డేస్. మళ్ళీ ఇంకో పది సంవత్సరాలకి ఇవి పాతరోజులు. పూర్వపు రోజులని పాత రోజులు అని మనం అనుకొంటున్నాము. మన తాతలనేమో పాతకాలం మనుషులు అంటున్నాము. ఇంకో పది సంవత్సరాల తరువాత మనల్ని పాతకాలం మనుషులు అంటారు. మోడరన్‌డేస్ అనే మాట అబద్ధం. ఈ కొత్త పాత కూడా అబద్ధమే. ఇదంతా మనస్సు యొక్క కల్పితం. ఏరోజుకి ఆ రోజే మోడరన్, ఏ రోజుకి ఆ రోజే లేటెస్ట్.

మీరు ఆత్మలో ఉన్న అందాన్ని కనుక చూస్తే, బయట అందాలు మీకు అందం కిందే కనపడవు. మీరు ఆత్మలో ఉన్న సౌందర్యాన్ని ఒకసారి జీవితంలో చూస్తే బయటఉన్న సౌందర్యాలు అసలు సౌందర్యం కిందే మీకు కనబడవు. ఆత్మ యొక్క రుచి ఒకసారి మీరు చూస్తే బయట రుచులు, రుచుల కిందే మీకు అనిపించవు. మీరందరూ దేవుడు దేవుడు అంటున్నారు కదా, మీకు తలంపు వచ్చాక దేవుడి గొడవ వస్తోందా, తలంపు లేకుండానే

దేవుడి గొడవ వస్తోందా? నిద్దట్లో మీరున్నారు కానీ మీకు అక్కడ దేవుడి గొడవ లేదు. మీరు రాముడి భక్తులో లేకపోతే కృష్ణుడి భక్తులో అనుకోండి మా రాముడు ఏం చేస్తున్నాడు, కృష్ణుడు ఏంచేస్తున్నాడు అని మీకు నిద్రలో ఈ గొడవ ఏమైనా ఉందా? గాఢనిద్రలో మీకు ఏ గొడవ లేదు. నిద్దట్లోమటుకు మీరు హాయిగా ఉన్నారు అక్కడ దేవుడి గొడవ లేదు. దేవుడి గొడవ లేనప్పుడు కూడా మీరున్నారు. ఆ మీరెవరో తెలుసుకోవటానికి మీరెందుకు ప్రయత్నం చెయ్యరు.

కొంతమంది మాకు రాముడు కనిపించాడు, శివుడు కనిపించాడు, కృష్ణుడు కనిపించాడు అని అంటారు. కనిపించాడనుకోండి మీరు వాడిని ఏం చేసుకొంటారు. తీరా కనిపించాడు, వాడు ఊరుకొంటాడా, ఏ కాఫీయో ఇమ్మంటాడు. లేకపోతే సత్యనారాయణ వ్రతం చెయ్యమంటాడు. ఏదో ఒకటి అడుగుతాడు కదండీ! ఈ మధ్యన మాకు దేవుడు కనిపిస్తున్నాడు అంటారు. కనిపించి ఏం చేస్తున్నాడు? అందరూ బాగున్నారా అని అడుగుతున్నాడా? పంటలు బాగా పండుతున్నాయా? వ్యాపారాలు బాగా సాగుతున్నాయా అని అడుగుతున్నాడా? నాకు పది మంది డాక్టర్లు కనిపించారు. అయినా నాకు రోగం తగ్గటం లేదు, ఎందుకు నాకీ డాక్టర్ల గొడవ, పోనీ ఆ డాక్టర్ల దర్శనం వల్ల నా రోగం తగ్గితే అనుకోవచ్చు. అలాగే పదిమంది దేవుళ్ళు కనిపించారు. దానివలన నీలో ఉన్న అజ్ఞానం పోయిందా? అది చూసుకోరేంటి మీరు? మీ లోపల ఉన్న అజ్ఞానం పోయిందో లేదో అది చూసుకోవటం వదిలేసి, నాకు దేవుడు కనిపించాడు అంటారు. వాడూ మీరూ ఆడుకుంటారా ఏమిటి? వాడికి మీకు సంబంధం ఏంటి అసలు? వాడితో మీకు పనేంటి? మీకు కాలక్షేపం అవ్వటంలేదా? మీకు కబుర్లు చెప్పకోవటానికి ఎవరూ దొరకలేదా? మీకు దేవుడు కనిపిస్తే వాడితో కబుర్లు చెప్పకుంటూ కూర్చుంటారా? వాడి దగ్గర ఎంతసేపు కూర్చుంటారు మీరు. లాజిక్ ప్రకారం మాట్లాడండి, నిజమైన దేవుడే, భారతయుద్ధంలో అర్జునుడికి రథసారథ్యం చేసిన వాసుదేవుడే మీకు కనిపించాడు. వాడూ మీరూ కలిసి ఎంతసేపు కూర్చుంటారు. మీ లోపలఉన్న అజ్ఞానం పోయిందా, లేదా? అది ముఖ్యం. అజ్ఞానం పోకపోతే మీకు ఆ దేవుడు కనిపించటం వల్ల ఫలితం ఏమిటి? ఎంతమంది డాక్టర్లు వైద్యం చేస్తే ఏం లాభం మీకు రోగం తగ్గనప్పుడు? మీ బాధ మీకే ఉంటుంది, మీ సమస్యలు మీకు ఉన్నాయి, మీ స్ట్రగుల్స్ మీకు ఉన్నాయి. ఎందుకు మీ స్ట్రగుల్స్ విడిచిపెట్టేసి మాకు దేవుడు కనిపించాడు అంటారు. మీకు దేవుడు కనపించినా మీ స్ట్రగుల్స్ మీకున్నప్పుడు

మీరు వాటికి ఎలా దూరం అవ్వగలరు? ఫ్రీడమ్ ఎలా వస్తుంది మీకసలు? ఎందుకు నా బాధని మీరు అర్థం చేసుకోరు? ఎందుకలా మీ ఎనర్జీని, టైముని వేస్టు చేస్తున్నారు? రాయవెల్లూరు డాక్టర్లు వచ్చి నాకు వైద్యం చేసారు, నా రోగం ఏమీ తగ్గలేదు, నేను సుఖపడతానా? నా రోగం తగ్గనప్పుడు, రాయవెల్లూరు డాక్టర్లు అయితే ఏమిటి? మద్రాసు డాక్టర్లు అయితే ఏమిటి? నాకు రోగం ఉన్నంతసేపు నా బాధ నాకు అలాగే ఉంటుంది. అలాగే రాముడు కనిపిస్తే ఏమిటి? కృష్ణుడు కనిపిస్తే ఏమిటి? నాలో అజ్ఞానం ఉన్నంతసేపు నాకు దుఃఖాన్ని తీసుకొస్తూనే ఉంటుంది. ఎందుకు ఈ మూలసమస్యని మీరు ఆలోచించరు? ఈ ఫండమెంటల్ ప్రశ్నను మీరెందుకు ఆలోచించరు? తనని తాను తెలుసుకోవటం కోసం గౌతమబుద్ధుడు మహారాజ్యాన్ని విడిచిపెట్టాడు. మనం చేసింది ఏమిటి? మనల్ని మనం తెలుసుకోవటానికి మనం వంకాయకూర విడిచిపెట్టలేము. రాజ్యాన్ని కాదు, కనీసం వంకాయకూర కూడా విడిచిపెట్టలేము. మీకు అందరికీ దుఃఖం వస్తోంది, ప్రతీ మనిషికి దుఃఖం వస్తోంది. అందులోంచి విమోచన కావాలి. ఈ సమస్య గురించి ఎందుకు ఆలోచించరు. మీకు కనిపించిన దేవుడు నిజమైతే మీ దుఃఖాన్ని ఎందుకు తియ్యటంలేదు వాడు? నేను చెప్పానని మీరు నమ్మొద్దు. మీకు కనిపించిన దేవుడే కనుక నిజమైతే వాడు మీ దుఃఖాన్ని ఎందుకు తియ్యటంలేదు? పోనీ రోజూ నాకు రెండు ఇడ్లీలు కావాలి అని అడుగుతారనుకోండి ఆయన ఇస్తాడు. పొద్దున్న రెండు ఇడ్లీలు తింటూ కూర్చుంటారు, మీ దుఃఖం పోతుందా? మోక్షం అంటే ఏమిటి? దుఃఖంలోంచి విడుదల పొందటమే మోక్షం. మీరిప్పుడే అది పొందొచ్చు. దేవుడు కనిపించటం మీకు మోక్షం కాదు. మీరు అనుభవిస్తున్న దుఃఖంలోంచి మీరు విముక్తి పొందటమే మోక్షం. మీరు అనుభవించే బాధలోంచి విడుదల పొందటమే మోక్షం. అది మీ నిజమైన ఇల్లు, ఆత్మే మీ నిజమైన ఇల్లు. ఆత్మకోసం ఎవడైతే జీవిస్తున్నాడో, వాడికి ఆత్మ తెలియబడుతుంది. ఎవడైతే తనకోసం తాను జీవిస్తున్నాడో వాడికి ఆత్మ తెలియబడదు.

ఈ అజ్ఞానానికి వయస్సు ఎంత ఉందో కానీ, మన తాతలని లొంగదీసింది, మన తండ్రులని లొంగదీసింది, మనల్ని లొంగదీస్తోంది. మన కొడకులని లొంగదీస్తోంది, మన మనవలని లొంగదీస్తోంది. మనం స్మశానానికి వెళ్ళిపోతున్నాము, కానీ అది స్మశానానికి వెళ్ళటంలేదు. మన తాతలు స్మశానానికి వెళ్ళిపోయారు. మన తాతలతో పాటు అది కూడా సర్దుకొంటే బాగుండును. మన తాతలు, తండ్రులు స్మశానానికి వెళ్ళిపోయారు. అజ్ఞానం

మాత్రం స్మశానానికి వెళ్ళటంలేదు. మరి దానికి ఎంత వయస్సు ఉందో మనకి తెలియటంలేదు. ఇది ఎవడినీ విడిచిపెట్టేలా లేదు. కొంతమంది అంటారు చూడండి. ఈ దరిద్రం మాతో వదిలిపోతే బాగుండును మా పిల్లలైనా సుఖపడతారు అంటారు. చాలామంది కష్టాలు పడేవాళ్ళు ఏమంటారంటే, మేము ఏదో కష్టాలు పడ్డాము, ఈ దరిద్రం మాతో వదిలిపోతే మా పిల్లలైనా సుఖంగా ఉంటారు అంటారు. అలా ఈ అజ్ఞానం వదిలిపోతే బాగుండును అని ఎవరైనా అనుకొంటున్నారా? ఇక్కడ కూర్చున్న వాళ్ళెవరైనా అజ్ఞానానికి వయస్సు ఎంత ఉందో చెప్పగలరా? నాలుగు వందల సంవత్సరాలు ఉందా, వెయ్యి సంవత్సరాలు ఉందా? పోనీ మనతోటి ఆఖరు అవుతుందా అజ్ఞానం?

మాకు దేవుడు కనిపించాడు అంటున్నారు. మీకు కనిపించిన దేవుడే కనుక నిజమైతే మీకు అజ్ఞానం ఎందుకు పోలేదు? ఈ ఒక్క ప్రశ్నకి మీరు సమాధానం చెప్పండి. నేను ఆత్మని తెలుసుకోవటానికి నాకు ఏది అడ్డు వస్తోంది అని ఏ మనిషికి ఆ మనిషి పరిశీలించుకుని, ఏదైతే అడ్డు వస్తోందో దాన్ని తొలగించుకోవాలి. అదే విచారణ. ఒకసారి పంజాబులో సిక్కుల మతగురువు ఒకతను శీతాకాలం బయట కూర్చున్నాడు. బాగా చలిగా ఉందని ఆయన సూర్యుడికి ఎదురుగా కూర్చున్నాడు. అప్పుడు ఒక భాగ్యవంతుడు వచ్చి నమస్కారం పెట్టి, ప్రభూ మీ దర్శనం కోసం వచ్చాము. మీకు ఏం కావాలంటే అది ఇస్తాను అన్నాడు. చలి వేస్తోందని సూర్యుడి కిరణాలు నా మీద పడతాయని బయట కూర్చున్నాను. నాకు సూర్యుడికి అడ్డుగా నువ్వు నిలబడ్డావు. నువ్వు నాకు ఏమీ ఇవ్వవద్దు కానీ, పక్కకు తప్పుకో, అదే నువ్వు చేసేది అన్నాడు. ఇఫ్ యు వాంట్ గాడ్ అండ్ గాడ్ ఎలోన్, కిక్ దిస్ వరల్డ్ మెరిసిలెస్లీ. నిజంగా దేవుడు ఎవరికీ అక్కరలేదు, కావలసింది లోకం. లోకంలో ఉన్నది శోకం కాబట్టి, లోకం వెనకాల శోకం వస్తుంది. మీరు దేవుడిని ప్రేమిస్తున్నాను అనుకొన్నప్పుడు కూడా మీరు ప్రేమించేది లోకాన్నే. దేవుడిని అడ్డుపెట్టుకొంటున్నారు. మీరు దేవుడిని ప్రేమిస్తున్నాను అనుకొనే సెకనులో కూడా, మీరు లోకాన్నే ప్రేమిస్తున్నారు, అది మీకు తెలియదు. దేవుడికోసం మీ దేహాన్ని త్యాగం చెయ్యగలరా, దేవుడికోసం మీ అహంకారాన్ని త్యాగం చెయ్యగలరా, దేవుడికోసం మీరు లోకాన్ని త్యాగం చెయ్యగలరా? మీరు దేవుడిని నిజంగా ప్రేమిస్తున్నారా? మనందరం భక్తులమే. లోకానికి భక్తులం కానీ దేవుడికి భక్తులం కాదు. దేవుడినే కనుక మీరు నిజంగా ప్రేమిస్తుంటే, మీకు ఏది మేలు చేస్తుందో దేవుడికి తెలుసు, ఏది మీకు ప్రసాదిస్తే మీకు మేలు కలుగుతుందో దేవుడికి

తెలుసు, మీ చేత ఆత్మని దర్శింపచేస్తాడు, అది మీకు మేలు కాబట్టి.  కానీ మనం దేవుడిని ప్రేమించటం లేదు లోకాన్ని ప్రేమిస్తున్నాము.  మీరు ఏమీ త్యాగం చెయ్యొద్దండీ, మీ అహంకారాన్ని త్యాగం చెయ్యటానికి మీరెవరైనా సిద్ధంగా ఉన్నారా?  మీ వస్తువులతో వాహనాలతో ఈశ్వరుడికి పనిలేదు.  మీ అరటిపండు కోసం బత్తాయి కోసం ఈశ్వరుడు చూడటంలేదు.  ఈశ్వరుడు బీదవాడేమీ కాదు, ధనవంతుడే.  మీ పువ్వులకోసం ఈశ్వరుడు చూడటంలేదు.

పొయ్యిలో ఉన్న మంటలో కట్టెలు ఎలా పెడుతున్నామో అలా ఈశ్వరాజ్ఞలో మీ అహంకారాన్ని ఆహుతి చెయ్యటానికి సిద్ధంగా ఉన్నారా?  ఈశ్వరుడు అనే అగ్నిలో మీ అహంకారాన్ని వెయ్యటానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా?  మీరు నిజంగా ధ్యానం చేస్తుంటే, మీరు గంటలనా ధ్యానం చేస్తుంది, దేవుడినా?  ధ్యానం చేస్తున్నప్పడు మీకు గంటలు జ్ఞాపకం వస్తుంటే, మీరు గంటలని ధ్యానం చేస్తున్నారా దేవుడిని ధ్యానం చేస్తున్నారా?  ఆత్మ ఇక్కడ లేదు, ఇప్పడు లేదు దానిని భవిష్యత్తులో సాధించాలి వచ్చేజన్మలో సాధించాలి అనుకోవటం కూడా తలంపే. ఈ జన్మలో లేని ఆత్మ, వచ్చే జన్మలో ఎక్కడినుంచి వస్తుంది.  మీలో ఉన్న అజ్ఞానం ఇలా వాయిదాలు వేయించేస్తుంది.  భవిష్యత్ కూడా తలంపు, తలంపు లేకపోతే భవిష్యత్తు లేదు.  అంటే లోపలఉన్న అజ్ఞానం తలంపు రూపంలో వచ్చి భవిష్యత్తు మీదికి గెంటేస్తుంది.  లోపలఉన్న అవిద్య సెకను సెకనుకి ముడి వేసేస్తోంది.  నేను ఎంత విద్యావంతుడనైతే, ఏ విద్య చదువుకొంటే ఏమి ఉపయోగం నాలో అవిద్య పోనప్పడు?  నా లోపల అవిద్య బయటికి పోనప్పడు ఏ విద్యయైనా ఒకటే.  మంటలో ఎన్ని కట్టెలు పెట్టినా కాలిపోతాయి, మంట కాల్చనని చెప్పదు.  ప్రాపంచిక విద్యలు ఎన్నైనా సరే పొయ్యిలో పుల్లల లాంటివే.  పొయ్యిలో వేసిన పుల్లలు ఎలా కాలిపోతాయో, చివరికి ఈ ప్రాపంచిక విద్యలన్నీ అంతే. ఏది విద్య?  నా లోపల అవిద్యని పోగొట్టేదే విద్య.  లోకానికి సంబంధించిన విద్యలన్నీ పొయ్యిలో పెట్టిన పుల్లలలాంటివి.  సోదరమహాశయులారా!  చివరిసారిగా నేను చెపుతున్నాను, నావల్ల మీ కడుపునొప్పి తగ్గిపోతే, నావల్ల మీకు తలకాయపోటు తగ్గిపోతే, నావల్ల మీరు ఆరోగ్యంగా ఉంటే, నేను జ్ఞానిని అనుకొంటున్నారు, ఎంత దురదృష్టం? నాలో ఉన్న ఆత్మని దర్శిస్తే నేను జ్ఞానిని అవుతాను కానీ, మీ తలకాయపోటు, కడుపునొప్పి, కాళ్ళు లాగటం తగ్గిస్తే, నేను జ్ఞానిని అవుతానా?  ఇదే లోకంలో ఉన్న వెలితి, ఈ రోజున లోకంలో జరిగేదంతా ఇదే.  నా వల్ల మీ తలకాయపోటు తగ్గిపోతే నేను జ్ఞానినా?  మీరు ఆలోచించుకోరా?

ఆలోచించుకోవలసిన పని లేదా? మరి ఆలోచనతోటి పని లేనప్పుడు ఈశ్వరుడు మనకి బుద్ధిని ఎందుకు ప్రసాదించాడు. మనకి ఆలోచించే పనే లేదనుకోండి అసలు, బుద్ధిని ఎందుకు ఇచ్చాడు ఈశ్వరుడు? ఊరికే ఇచ్చాడా? ఆలోచించుకోమనే కదా ఇచ్చాడు. మనం ఆలోచించము అనుకోండి, ఇంక దాని ఉపయోగం ఏంటి? ఆలోచనతో పని లేనప్పుడు, మరి భగవంతుడు బుద్ధిని ఎందుకు ఇచ్చాడు. కాళ్ళు ఇచ్చాడు నడుస్తున్నాము చేతులు ఇచ్చాడు, చేతులతో అనేక పనులు చేసుకొంటున్నాము. కళ్ళు ఇచ్చాడు చూస్తున్నాము. చెవులు ఇచ్చాడు వింటున్నాము. మరి బుద్ధి ఎందుకు ఇచ్చినట్టు. ఆలోచించుకోమనే కదా ఇచ్చాడు. మరి జీవితంలో ఎప్పుడైనా ఆలోచించారా?

ఎవడైతే ఆత్మకోసమే జీవిస్తున్నాడో, ఎవడైతే ఆత్మకోసమే తనని తాను వదులుకొంటున్నాడో, వాడికి ఆత్మ దర్శనం అవుతుంది. దేహగతమైన జీవితం, మనోగతమైన జీవితం ఉన్న వాడికి, అహంకారమే కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడికి ఆత్మ దర్శనం అయ్యే అవకాశం లేనేలేదు. మీరందరూ పని బరువు అనుకొంటున్నారు. పని బరువు కాదు. ఆ పని చేసేటప్పుడు దాని ఫలితం, ఏమౌతుందో అని ఆలోచించటమే బరువు. మీ ఆలోచనే బరువు. పని బరువు కాదు. పని చేసేటప్పుడు ఇది ఏమౌతుంది అని ఆలోచిస్తూ ఉంటారు కదా. మీ ఊహలు, తలంపులు బరువు, పని బరువు కాదు. ఈ పని వల్ల ఎటువంటి ఫలితం వస్తుంది అని, మీరు రిజల్ట్ గురించి ఆలోచిస్తారు. ఆ ఆలోచన బరువు ఆసక్తి బరువు. కొబ్బరి చెట్టు వేయటం బరువు కాదు. ఎప్పటికి కాస్తుంది, ఎప్పుడు కాస్తుంది అని ఆ ఆలోచన బరువు. అది కాసే రోజున కాస్తుంది. మీరు ఆలోచించినంత మాత్రంచేత రెండు రోజులు ముందు కాసేయదు. మీరు చెయ్యవలసిన డ్యూటీ చెయ్యటం అంతే. అస్తమానూ ఆసక్తి పెట్టుకొంటే అది దుఃఖాన్ని తీసుకొస్తుంది. దాంట్లోంచి అనారోగ్యం వస్తుంది. ఆసక్తి లేకుండా ఎవడైతే జీవిస్తున్నాడో వాడికి దుఃఖం దూరం అవుతుంది, అనారోగ్యానికి కూడా దూరం అవుతాడు. ఆసక్తి లేకుండా పని చేస్తే పాపానికి కూడా దూరం అవుతాడు. ఆసక్తి లేకుండా జీవించే వాడే నిజమైన సుఖి!

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జూలై 2017, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అని ప్రతీ జీవుడికి రూపబుద్ధి, నామబుద్ధి బలీయంగా ఉంటుంది. ఈ రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి నిన్ను ఎవడయితే